క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: ఇసుకపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 17న ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల మధ్యలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ పట్టణ ఏఈ పి.ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా నాగేంద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని నాగేంద్రస్వామి 7వ ప్రతిష్ఠ మహోత్సవాలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్షాపరులకు, భక్తులకు వేర్వేరుగా అన్నప్రసాదాలు అందజేశారు.

బాలికా సదన్ సందర్శన



బాపట్ల అర్బన్: పట్టణంలోని బాలిక సదన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి గురువారం ఉదయం పరిశీలించారు. సదన్‌లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న బాలికా సదన్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.ఉమా, సూపరింటెండెంట్ ఎం. శేఖర్, ఐసీడీఎస్ సీడీపీఓ బి.శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆట్ల అమ్మిరెడ్డి మృతి తీరని లోటు


కర్లపాలెం(పిట్టలవానిపాలెం): వైఎస్సార్ సీపీ నాయకుడు ఆట్ల అమ్మిరెడ్డి మృతి తీరని లోటని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఎంపీరాజు పాలెంలో అమ్మిరెడ్డి దశ దిన ఖర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట బాపట్ల ఏఎంసీ చైర్మన్ డి.సీతా రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ఆట్ల నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

వరి కోతలు ప్రారంభం



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రాల ద్వారా వరి కోతలకు శ్రీకారం చుట్టారు రైతులు. దీంతో తక్కువ ఖర్చు అవుతోందని అన్నదాతలు అంటున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదని, గంటకు రూ.2,800 యంత్రానికి తీసుకుంటున్నారని తెలిపారు. ఎకరం వరి కోతకు గంట సమయం పడుతున్నట్లు చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



పిట్టలవానిపాలెం: అల్లూరు శివారు రెడ్లపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంను గురువారం ఎంఈఓ రాజారత్నం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం పేరుతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందజేస్తోందని తెలిపారు. భోజనంను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి(ఇన్‌చార్జి) కేపీ బాలాజీ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9న జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాయిబాబాకు అన్నదానం ప్రీతిపాత్రం

తెనాలి: సాయిబాబాకు అత్యంత ప్రీతిపాత్రమైంది అన్నదానమేనని సాయిప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం చినరావూరు డొంకలోని కాలనీలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి..సంక్షేమం రెండు కళ్లుగా పాలన

ఎమ్మెల్యే కోన రఘుపతి



ఖాజీపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇది ఇలానే కొనసాగాలంటే.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, బాపట్ల ఎమ్మెల్యేగా తనను మరోమారు గెలిపించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రజలను కోరారు. మండలంలోని పెదపులుగువారిపాలెం, పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం గ్రామాలలో గురువారం ఆయా గ్రామ సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్కల శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు ఎల్లావుల ఏడుకొండలు, ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, కర్లపాలెం జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల రెడ్డి, చేబ్రోలు వీరయ్య, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

కొల్లూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని గాజుల్లంక సర్పంచ్ సనక వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని గాజుల్లంక సచివాలయం వద్ద నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సంక్షేమ పథకాల లబ్ధిని ఆయన వివరించారు. సచివాలయం పరిధిలోని గాజుల్లంక, ఆవులవారిపాలెంలోని అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి రూ. 26.64 కోట్లు సంక్షేమ లబ్ధి అందినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షం.. వైఎస్ జగన్ ప్రభుత్వం

చెరుకుపల్లి: రాష్ట్రానికి దిశానిర్దేశకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, ఆయన మరలా సీఎం అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. తూర్పుపాలెం సచివాలయ పరిధిలో గురువారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం స్థానిక సర్పంచ్ తూము రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సచివాలయ ప్రాంగణంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. తూర్పుపాలెం పంచాయతీకి వివిధ పథకాలు ద్వారా రూ.22.3 కోట్లు లబ్ధి చేకురిందన్నారు. వైసీపీ మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, నాయకులు బండారు రామారావు, తూము కోటేశ్వరరావు, రావూరి నాగేశ్వరరావు, అఖిల తదితరులు పాల్గొన్నారు.



గుడ్డికాయలంక గ్రామ అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాల విడుదల



ఐలవరం-2లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

రైతు ప్రభుత్వం..

రేపల్లె రూరల్: రైతులకు అండగా నిలుస్తూ సాగుబడిలో పెట్టుబడిసాయం అందిస్తూ.. వ్యవసాయ రంగాన్ని పండగ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి రైతు కృతజ్ఞతగా ఉన్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. మండలంలోని గుడ్డికాయలంక గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించిన జగనన్న రైతులకు బాసటగా నిలుస్తున్నారన్నారు. పెట్టుబడి సాయంతోపాటు రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అందించటంతో పాటు గిట్టుబాటు ధరతో ధాన్యంను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాస రావు, మాజీ జెడ్పీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి భానుకోటి తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే

రేపల్లె: పేదల ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని 8, 10 వార్డుల సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ (జగన్ అన్న ఎందుకు కావాలి) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసి పేద వారికి ఆర్థిక భద్రత కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. పేదవారి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వేలాది మందికి స్థలాలను కేటాయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. సచివాలయాల్లో ఆయా వార్డులు పొందిన సంక్షేమ లబ్ధి వివరాలను మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, వార్డుల ఇన్‌చార్జ్‌లు సింహాచలం, వీరెళ్ల అంజిబాబు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు పాల్గొన్నారు.



8, 10 వార్డుల అభివృద్ధి కరపత్రాలు ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

ఐలవరం-2 సచివాలయంలో..

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం-2 సచివాలయం పరిధిలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షతన గురువారం '' వై ఏపీ నీడ్స్ జగన్ '' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో నవరత్నాల్లో భాగంగా డీబీటీ రూపేణా రూ. 22.50 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లు ఈవోపీఆర్డీ, నోడల్ ఆఫీసర్ టి. ఉషారాణి, తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఉప సర్పంచ్ కర్రా జయశ్రీ, వైఎస్సార్ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందర రావు, పంచాయతీ వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మంతెనవారిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మంతెనవారిపాలెం గ్రామంలో ఈ నెల 17న ఏపీకి వైఎస్ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాస రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని పేర్కొన్నారు.

22న ఆలయ వార్షికోత్సవం

పడమటిపాలెం(భట్టిప్రోలు): కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందరకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు విశేష పూజలు, హనుమత్ కల్యాణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 33 అడుగుల ఎత్తు గల ఈ విగ్రహన్ని 2008లో ప్రతిష్ఠించారు. ప్రజల సహకారంతో దేవాలయాన్ని కూడా నిర్మించారు.

భారత రాజ్యాంగం విశిష్టమైనది

బాపట్ల అర్బన్: రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా జనవరి 26న జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర నాయకుడు కోటా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఊరూరా జన విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి కర్లపాలెం మండలంలోని యాజలి జెడ్పీ హై స్కూల్‌లో పక్షోత్సవాలను వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలలో విశిష్టమైందన్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ డ్రాఫ్ట్ చైర్మన్‌గా ఉండి రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఫజుల్లాఖాన్, రామ్మోహన్‌రావు, ఎస్కే సుభాని తదితరులు పాల్గొన్నారు.

పెదరావూరు ఉప సర్పంచ్‌గా జాస్తి సమత

పెదరావూరు(తెనాలి): రూరల్ మండలం పెదరావూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా 2వ వార్డు సభ్యురాలు జాస్తి సమత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జయంత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఎన్నిక కోసం ప్రతి పాదనలు కోరిన వెంటనే 14వ వార్డు సభ్యుడు షేక్ నాగూర్.. సమత పేరును ప్రతిపాదించారు. 12వ వార్డు సభ్యుడు శ్రవణం శ్రీనివాసరెడ్డి బలపరిచారు. ఇతర ప్రతిపాదనలు ఏవీ లేకపోవటంతో ఉప సర్పంచ్‌గా జాస్తి సమత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తెనాలి ఎంఈఓ-2 జయంత్ బాబు ప్రకటించారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఆమెకు అందజేశారు.

వెనుకబడిన కులాలకు మేలు జరగాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్

బాపట్ల: కులగణనతో వెనుకబడిన కులాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ, సామాజిక సమన్యాయం సాధించేలా ప్రభుత్వ కార్యాచరణ రూపొందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవి కుమార్ మాట్లాడారు. కులగణనను ప్రారంభించే క్రమంలో కలెక్టర్ కార్యాలయంలో అన్ని కులాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ ప్రకారమే కులగణన నిర్వహించాలని, మార్పులు, చేర్పులు చేస్తే భవిష్యత్తులో పలు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, కార్యదర్శులు ఎన్ ఎస్పీ రాజు, మారం రవి కుమార్, నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యార్థులకు నేస్తాలు

పిట్టలవానిపాలెం: గ్రంథాలయాలు విద్యార్థులకు నేస్తాలు వంటివని కర్లపాలెం శాఖ గ్రంథాలయాధికారి టి.వి.రమణమ్మ అన్నారు. గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమాలలో పాల్గొన్న పలువురు ప్రముఖులపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలు ఉంటాయని, వీటి ద్వారా శాస్త్ర విజ్ఞానంతో పాటు నైపుణ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ఈ నెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుమతి, ప్రసన్న స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట పోటీలు

యడ్లపల్లి(వేమూరు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, లెమన్ స్పూన్ వంటి పోటీలు గురువారం నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకులు బి.గిరిజా సుందర్ గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల సేవలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు పురస్కరించుకుని గురువారం గ్రంథాలయ ఉద్యమానికి పాటుపడిన ప్రముఖుల సంస్మరణ ఏర్పాటు చేశారు. గ్రంథాలయ ఉద్యమంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కె. హవిలా ప్రశాంతి, ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ ఆరీఫాలు విచ్చేశారు. గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న హరిప్రసాద్, జనార్దనరావు

తెనాలి: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడంలో భాగంగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిర్ణయించారు. ప్రముఖ పారిశ్రామిక సంస్థ సీసీఎల్ సహకారంతో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో పట్టణంలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ వీటిని అమర్చాలన్నది ఎమ్మెల్యే శివకుమార్ స్వయంగా పోలీస్ అధికారులతో కలిసి పరిశీలన చేసిన విషయం తెలిసిందే. పట్టణంలో ఎనిమిది కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు గురువారం ఉదయం స్థానిక బోసు రోడ్డులో వీనస్ టాకీస్ ఎదురుగా భూమిపూజ చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, తెనాలి డీఎస్పీ బి.జనార్దన రావు భూమిపూజ చేశారు. పట్టణంలో వాహన రద్దీని క్రమబద్ధీకరిస్తూ ఎమ్మెల్యే శివకుమార్ సిగ్నలింగ్ వ్యవస్థను తీసుకొస్తున్నట్టు హరిప్రసాద్ చెప్పారు. ప్రజలు, వాహన చోదకులు సిగ్నల్స్‌ను అనుసరించి నడుచుకుంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని డీఎస్పీ జనార్దనరావు అన్నారు. నంది వెలుగు కూడలి ప్రాంతంలోనూ ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను అమల్లోకి తేవాలని ఈ సందర్భంగా తెనాలి పట్టణ, పరిసర ప్రాంతాల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు దరిశ శివకోటేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భూమి పూజలో పట్టణ సీఐలు కె.చంద్రశేఖర్, రమేష్‌బాబు, ఎస్.వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ బి.శివరామయ్య, ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్, మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, చుండూరు సాయి, బ్రహ్మం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా కులగణన చేయాలి

చెరుకుపల్లి: బీసీలకే రాజ్యాధికారం రావాలంటే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చెరుకుపల్లి మండల బీసీ నాయకులతో గుళ్లపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసేందుకు మంత్రి వర్గంలో తీర్మానించటం సంతోషదాయకమన్నారు. బీసీల్లో కొన్ని కులాల వారు ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగు పెట్టలేదని ఈ కులగణన వల్ల వారికి అన్ని రకాలుగా లబ్ధి చేకురుతుందన్నారు. బీసీ కులాల వారు గృహాలకు వచ్చిన అధికారులకు పూర్తిగా సహకరించి కులం వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. దీని ద్వారా రాష్ట్రంలో బీసీలు శాతం ఎంత ఉందో తెలుస్తుందన్నారు. బీసీ నాయకులు ఉండ్రకుండ శివ రావు, ఉల్లంగుంట నాగరాజు. కె.రాంబాబు, ఎస్, మాల్యాద్రి, అక్కల నాగబాబు, మణికంఠ, చంద్ర బాబు పాల్గొన్నారు.

ఆంధ్ర ఔట్‌డోర్ లోకేషన్స్‌ను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: సినిమా నిర్మాణాలకు మన రాష్ట్రం అనువైనదని, వ్యయం కూడా తక్కువగా అవుతుందని, ఔట్‌డోర్ లోకేన్స్ ఎక్కువగా ఉన్నాయని సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని మా ఏపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబసింగి, అరకు లోయ, విశాఖపట్నం, ఎర్రకొండలు, కొండవీడు, నిజాంపట్నం హార్బర్, లోయలు, జలపాతలు, కొండలు, అటవీ ప్రాంతం, అందమైన లంక గ్రామాలు ఇలా ఎన్నో సినిమా స్థాయిని పెంచే లోకేషన్లు ఉన్నాయని చెప్పారు. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు నిర్మించే నిర్మాతలకు ఆంధ్ర ప్రదేశ్ వరప్రసాదం లాంటిదన్నారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మళయాళి, బోజిపూరి నిర్మాతలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తరప్రదేశ్ నటుడు అమీర్ చౌదరి, మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

తెనాలిఅర్బన్: ఆర్థిక అక్షరాస్యతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆ పథక జిల్లా రిసోర్స్ పర్సన్ డాక్టర్ శీతాలపు శ్రీనివాసరావు సూచించారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు, పెట్టుబడుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటి విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదించాలని చెప్పారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బాగుండాలంటే వైఎస్ జగనే సీఎం కావాలి

ఖాజీపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి

పిట్టలవానిపాలెం: పేదలందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా లీలా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి జగనన్న పేద వర్గాలకు కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వస్తేనే ఆ పథకాలు తమకు అందుతాయంటూ ప్రజానీకం ముక్త కంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యురాలు కె.కాంతకుమారి, గ్రామ సర్పంచ్ కుంభం అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసన్నరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, మాజీ సర్పంచ్‌లు మంతెన రామచంద్రరాజు, ఏసుభక్తి, బొలగాని సుబ్బారావు, పార్టీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, ఎనుముల కోటేశ్వరరావు, జేసీ కన్వీనర్ అల్లూరి సురేష్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



చర్చి ప్రాంగణంలో కంటి పరీక్షలు

మూల్పూరు(వేమూరు): గ్రేస్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలో బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజు సహకారంతో వృద్ధులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. శుక్లాలు ఉన్న వ్యక్తులకు ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ సంస్థ టెక్నీషియన్ నవీన్, సిబ్బంది సరళ, బాజీ, నిర్వాహకులు భవనాసి కిషోర్, మూల్పూరు సీతయ్య, బందెల సురేష్, నల్లూరు రవి, స్వప్న మిత్ర, కూచిపూడి ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన



సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదన్‌రెడ్డి, మండల వైద్యాధికారి లక్ష్మిసుధ పాల్గొన్నారు.

కొల్లిపర: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏఓ వి.చంద్రమోహన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం మండల కమిటీ, టెక్నికల్ బృందం సభ్యులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులకు ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్రీడా పోటీలకు అనుగుణంగా ఉన్న పాఠశాలల మైదానాలను పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు,

నేరాలపై అప్రమత్తత అవసరం

తెనాలి: సమాజంలో యువతులు, మహిళల పట్ల జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నారాయణ జూనియర్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు.

విద్యార్థి దశలో సినిమాలు, షికార్లు, ప్రేమల పేరుతో జీవితాన్ని సమస్యలమయం చేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సీపీఎం తెనాలి నియోజకవర్గ కార్యదర్శి కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ మంచిగా చదువుకుని, తల్లిదండ్రులతో ప్రేమానురాగాలను కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సుకు ప్రిన్సిపల్ పవన్ అధ్యక్షత వహించారు. కాలేజి ఏవో, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆరే మరియదాసు పాల్గొన్నారు.